# పిల్లంగ్రోవి

ఆ బాలకుని పిల్లంగ్రోవి పొలంగట్టులు, చేలు, కాలవలు, కొద్ది దూరాన ఉన్న కొండలు నిండుతూ ఉన్నది.

అతనికి రాగజ్ఞానంలేదు! అతడు స్వరవిద్య నేర్చుకోలేదు. అతని గురువులు కోకిల, తుమ్మెద, సెలయేరు ఆవుల అంబారవం, చేలమీదనుంచి తేలిపోయే మలయబాలకుడు, ఉఱుము, కీచురాయి, లవంగి పిట్టలు.

అతనికి ఉన్న జ్ఞానమే గాంధర్వము. ఒక స్వరం ఇంకో స్వరం శ్రుతి చూస్తాడు. అతని ఊపిరే లయ! ఆ లయలోంచి వచ్చిన తాళాలు మూడే. ఆది, ఏక, రూపక తాళాలు.

అతడు కల్పించిన గీతాపథకాలు విచిత్ర మూర్ఛనలు.

## 2

గొడ్లకాపు కుఱ్ఱవాడు, తొమ్మిదేండ్లు ఈడువాడు. చలిదివన్నం గంజి ఉప్పుచేప నంజుకుంటూ మెక్కి, ముంతలో గంజివన్నం పెట్టుకొని, ఉప్పులో ఊరవేసి ఎండబెట్టిన మామిడికాయ బద్ద, కంచమూ మూటకట్టుకొని గేదెపై స్వారి అవుతూ ఏటిగట్టుకు వస్తాడు.

అతని సింహాసనం వేపచెట్టు నీడ, అతని ప్రజలు పశువులు, అతని ఆయుధం పిల్లంగ్రోవి!

అతని పట్టుపీతాంబరాలు చినిగిన గోచీ, చినిగిన తలపాగాగుడ్డ! వానవస్తే రెండు గేదెల్ని నిలబెట్టి వాటి అడుగున కూచుంటాడు. ఏరుపొంగితే గేదెలమీద దాటుతాడు. అతని రక్షకభటులు ఆవులు గేదెలు. పెద్దపులినైనా దూరాన నిలబెట్టుతాడు.

## 3

పశువులతో మేతబయలుకు రాగానే "పొండఱ్ఱా" అని చెట్టుకింద మకాం వేస్తాడు. ఆటలు ఆడుతాడు, పాటలు పాడుతాడు.

పిల్లంగ్రోవి తీసి భువనమోహనంగా వాయిస్తాడు. ఆ పాటలకు సాహిత్యం అతని హృదయమే!

ఒకసారి అతనిపాట ఎగిరి గంతులువేస్తుంది. పూవులుపూస్తుంది. చిరుసువాసనలు వెదజల్లుతుంది. చిట్టిచిట్టి ఊటలా జలజలలాడుతుంది.

ఒకసారి అతని పాట లోకాన్ని చూచి ఆశ్చర్యం పడుతుంది. తెల్లబోతుంది, వణుకుతుంది.

ఒకసారి అతని గీతం ఏదో వెదుకుతుంది. ఆకాశాన్ని పారకించి చూస్తుంది. భూమిలోతులు చొచ్చిపోతుంది. నదీ నీరాంబుకణాలు లెక్క బెడుతుంది.

మరి ఒకసారి కంటనీరు నింపుతుంది. ఏదో ఎరగని భయంచే ముడుచుకుపోతుంది, ఆకలై శుష్కిస్తుంది, మానవుని సర్వబాధలై విలపిస్తుంది.

ఇంకొకసారి అన్నీ తెలిసిన జ్ఞానిపద్మంలా యోగముద్ర వహిస్తుంది. గడ్డిపూవుల నివేదనలిస్తుంది. ఏటిలోని చేపలులా లోతులు కనిబెట్టుతుంది.

ఆ బాలుడు పిల్లంగ్రోవి పెదవులతో చుంబిస్తూ తన సృష్టి తనకే తెలియని బాలుడౌతాడు.

## 4

**ఒ**కరోజు ఆ పక్క పొలంలోనుంచి పొలంకూలీ బాలిక ఒకతె అతని పాటదారినే అతన్ని వెతుక్కుంటూ వచ్చింది.

ఆ బాలిక ఎనిమిదేళ్ళబిడ్డ! అతనికి ఎదురుగా అతని పాట వింటూ కదలకుండా కూరుచుంది.

ఆమెవచ్చి అతని రాజ్యాన్ని హరించలేదు, భాగించలేదు.

ఆమె అతని రాజ్యంలో, అతని పాటలో, అతనిలో భాగమయింది.

ఆమెకూడా ప్రతిరోజూ అతడు పాటబాడేవేళకు వచ్చి అతని ఎదురుగుండా కూచునేది.

ఆ బాలికకు ఓ చింపిగుడ్డ మొలకు ఆగుడ్డ. ఆమె నగ్నతను పూర్తిగా కప్పనేలేదు. ఆమె చేతికి రెండు గాజు గాజులు, ఆమెకాళ్ళకు రెండు అల్యూమినియం కడియాలు.

ఆ బాలుని మోము సూర్యబింబం అవుతే, ఆమె మోము ఆ పక్క చెరువులోని పద్మమే!

## 5

**ఒ**కదినాన అతడు పిల్లంగ్రోవి వాయిస్తున్నాడు. లోకం అంతా సమ్మోహనమై అతని పాట వింటోంది. ఆ బాలిక ఆ పాటే అయింది.

ఇంతలో లోకాలు బద్దలుచేసే ధ్వనితో ఆకాశంలో ఏదో పెద్దపక్షి.

ఆ చప్పుడుకు అదిరిపడి ఆ బాలకుడు పిల్లంగ్రోవి ఆపి గభాలున భూమిమీద పడిపోయాడు. ఆ బాలిక దద్దరిల్లి హోరుమంటూ అతనిపక్క వాలి అతన్ని కౌగలించుకొంది.

ఆ రాక్షసి పక్షి వెళ్ళిపోయింది. కొంతసేపటికి ఆ పసికందు లిద్దరూ లేచి తమచుట్టూ అంతా కళ్ళనీళ్ళతో పాఱచూచారు.

అతని ఆవులు, గేదెలు నిశ్చలంగా మేస్తున్నాయి. పువ్వులు వికసించివున్నాయి. వేపచెట్టు ఆవరించే ఉన్నది. సెలయేరు జలజల ప్రవహిస్తూ ఉన్నది.

అతడు ధైర్యం వహించి పిల్లంగ్రోవి తీసి మళ్ళీ మూడు పవిత్ర స్వరాలు కలిపాడు. ఏమీ విశ్వం అన్నట్టుగా ఒక్క మూర్ఛన వచ్చింది. ఆ బాలిక అతన్ని కౌగలించుకునే ఉంది.

దూరంగా యూరపులో యుద్ధం జరుగుతున్నది. జపాను పెరల్ హార్బరుపై విరుచుకుపడింది.

ఆ బాలకుడు అదటుతీరి రోజూ ఆకాశంలో వచ్చిపోయే ఆ రాక్షస పిట్టల మ్రోతకు శ్రుతికలిపి ఒక కొత్త మూర్ఛన మ్రోయించాడు. ఆ బాలిక చిరునవ్వుతో అతని పాట పరవశయై విన్నది.